క్లుప్తంగా

రైతుబజార్‌లో సబ్సిడీపై టమాటాల విక్రయం




తిరువూరు: స్థానిక చీరాల సెంటర్‌లోని రైతుబజార్‌లో సబ్సిడీపై టమాటాల విక్రయాన్ని సోమవారం ప్రారంభించారు. తొలి రోజు 2,029 కిలోల టమాటాలు తిరువూరుకు కేటాయించగా, ఒక్కొక్క వినియోగదారుడికి కిలో చొప్పున విక్రయించామని సీఈవో చిట్టిబాబు తెలిపారు. బయట మార్కెట్‌లో టమాటా అధిక ధర ఉండడంతో సబ్సిడీపై కిలో రూ.50కి విక్రయించడంతో టమాటాల కోసం రైతుబజార్ వద్ద రద్దీ ఏర్పడింది.

కిడ్నీ పేషెంట్‌కు పింఛన్ అందజేత



జి.కొండూరు: మండల పరిధి గుర్రాజుపాలెం గ్రామానికి చెందిన చింతకింద నాగమణి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి నూతనంగా మంజూరైన రూ.10 వేల పింఛన్‌ను సర్పంచ్ తమటం వెంకట్రామయ్య సోమవారం అందజేశారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా శాకంబరీ దేవి ఉత్సవాలు



జి.కొండూరు: చెవుటూరు గ్రామంలోని శ్రీ బాలకోటేశ్వర స్వామి దేవాలయంలో సిద్ధాంతి కొంపెల్ల సత్య కృష్ణప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో శాకాంబరీ ఉత్సవాలను సోమవారం నిర్వహించారు. స్వామి వారికి గ్రామస్తులు ఆషాఢ సారెను సమర్పించారు. ఆలయ కమిటీ ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

విస్సన్నపేట: స్థానిక కలకదుర్గా అమ్మవారి దేవస్థానంలో సోమవారం అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సౌందర్య లహరి, అమ్మవారి పారాయణం, అర్చనలు నిర్వహించారు.

కనులపండువగా కల్యాణోత్సవం



గంపలగూడెం: గురుపౌర్ణమి సందర్భంగా నెమలి శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాన్ని సోమవారం రాత్రి గంపలగూడెంలో కనులపండువగా నిర్వహించారు. నెమలి దేవస్థానం, గంపలగూడెం మండల ఆర్యవైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రమానాథ రైస్‌మిల్ ఆవరణలో కల్యాణోత్సవం జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలచార్యులు అర్చక బృందంచే సత్యభామ, రుక్మిణిదేవి సహిత శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణం జరిగింది. 158 మంది దంపతులు పీటలపై కూర్చుని కన్యాదానం గావించారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.రామచంద్రరావు, మండల శాఖ అధ్యక్షుడు నాళ్లా చిన్న సత్యంబాబులు, నెమలి దేవస్థానం చైర్మన్ కావూరి శశిరేఖ, సహాయ కమిషనర్ డి.శ్రీరామవర ప్రసాదరావు పర్యవేక్షించారు.

విత్తన దుకాణాల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీలు



విస్సన్నపేట: స్థానిక విత్తనాల విక్రయ దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఏడీఏ బి.కళ్యాణకుమార్, విజిలెన్స్ సీఐ కె.వెంకటేశ్వర్లు, ఏవో రాజ్యలక్ష్మి రెండు విత్తనాల విక్రయ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి పీసీ ఫారాలు లేని కారణంగా రూ.7,500 గల విత్తనాల అమ్మకాలను నిలిపివేసి, 6 ఏ కేసు నమోదు చేసినట్లు ఏవో తెలిపారు. మొక్కజొన్న విత్తనాలను సేకరించి ల్యాబ్‌కు పంపామన్నారు.

నేడు నూజివీడు పట్టణంలో గడప గడపకు మన ప్రభుత్వం

నూజివీడు: పట్టణంలోని 29, 30 వార్డుల్లో మంగళవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్యే ప్రతాప్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తారన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు సత్వర సేవలు

- చంద్రబాబు మాయమాటలు నమ్మొద్దు
- ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



వట్టిగుడిపాడులో సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు, అధికారులు, నేతలు

ఆగిరిపల్లి(నూజివీడు): జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు సత్వర సేవలు అందిస్తున్నామని ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు తెలిపారు. ఆగిరిపల్లి మండలంలోని వట్టిగుడిపాడులో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా 776 మందికి సర్టిఫికెట్లను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులైన ఏ ఒక్కరూ ప్రభుత్వ పథకాలను లబ్ధి పొందకుండా మిగిలిపోకూడదన్న లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టారన్నారు. ప్రజలకు జవాబుదారీతనం ఉండాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సత్వరమే 11 రకాల సర్టిఫికెట్లను ఉచితంగా అందిస్తున్నామన్నారు. చంద్రబాబు అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ అని ఎమ్మెల్యే ప్రతాప్ విమర్శించారు. చంద్రబాబు చెప్పే పథకాలను రాష్ట్రంలో ఎవరూ నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో వెంకటరత్నం, ఎంపీడీవో పి.శంకర్‌రావు, తహసీల్దార్ ఉదయభాస్కర్, ఎంపీపీ గోళ్ల అనూష, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పలగాని నరసింహరావు, సర్పంచ్ యలవర్తి కిరణ్మయి, ఎంపీటీసీ వనమా ఏసు, డీటీ పవన్‌కుమార్, నాయకులు సూరిబాబు, చింతపట్ల మాధవరావు, నండూరి భాస్కరప్రసాద్, ఈ.సుబ్బయ్య, నారాయణస్వామి, సింహాద్రి రంగారావు పాల్గొన్నారు.

ఎమ్మార్ అప్పారావు కాలనీలో జగనన్న సురక్ష

నూజివీడు: పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు కాలనీలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక్కడి సచివాలయం పరిధిలో 1,863 కుటుంబాలుండగా అందులో 1,548 కుటుంబాలకు ఈకేవైసీ చేశారు. 903 మంది వివిధ రకాల సర్టిఫికెట్లకు అర్జీ అందజేయగా వాటిలో 732 సర్టిఫికెట్లను మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, డీఈ దాస్యం లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు షేక్ రజియాబేగం, దాసరి మారు అప్పాజీ, యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి కొలుసు సౌమ్య, మెప్మా సీఎంఎం ఆనంద్, నాయకులు షేక్ మస్తాన్, నౌషీ, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, వలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు. మండలంలోని గొల్లపల్లి సచివాలయం-2 పరిధిలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల స్పెషల్ ఆఫీసర్ ఎస్.రామ్మోహన్‌రావు, ఎంపీడీవో వీపీ విజయ్‌కుమార్, తహసీల్దార్ డీవీఎస్ యల్లారావు, ఈవోపీఆర్డీ టి.సరస్వతి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి వారి సమస్యలను పరిష్కరించారు. లబ్ధిదారులకు 317 ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. సర్పంచ్ బొకినాల వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీలు చల్లారి రేణుక ధనలక్ష్మి, తటకలూరు రామయ్య, చల్లారి రాఘవ, ఎస్సీపీ వెంకటేశ్వర్లు, మేరుగ లెనిన్ పాల్గొన్నారు.



లోపూడిలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ తదితరులు

లోపూడిలో జగనన్న సురక్ష కార్యక్రమం

ముసునూరు: జగనన్న సురక్ష కార్యక్రమం చరిత్రలో నిలుస్తుందని ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి, జెడ్పీటీసీ డా.వరికూటి ప్రతాప్ పేర్కొన్నారు. జగనన్న సురక్ష మండల ప్రత్యేకాధికారి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ప్రత్యేక పర్యవేక్షణలో ఎంపీడీఓ జి.రాణి అధ్యక్షతన సోమవారం లోపూడిలో తొలిరోజు జగనన్న సురక్ష గ్రామ శిబిరం నిర్వహించారు. శిబిరం గుర్తుగా ప్రాంగణంలో అధికారులతో కలిసి సబ్ కలెక్టర్ కొబ్బరి మొక్కలు నాటారు. శిబిరంలో ఏర్పాటు చేసిన వివిధ సేవలకు సంబంధించిన స్టాల్స్‌ను, మెడికల్ క్యాంపును ఆయన పరిశీలించారు. అనంతరం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. వైస్ ఎంపీపీ రాజానాయన, సర్పంచ్ పేరం కృష్ణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తహసీల్దార్ దాసరి సుధ, అధికారులు ఎమిలీ కుమారి, సత్యనారాయణ, రవీంద్రరెడ్డి, సాయిరాము, మధుమోహన్, సత్యప్రసాద్, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రైతుభరోసా కేంద్రాలతో మెరుగైన సేవలు

ఎమ్మెల్యే రక్షణనిధి



వినగడపలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి, నేతలు

వినగడప(గంపలగూడెం): రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు మెరుగైన సేవలను అందించేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. గంపలగూడెం మండలం వినగడపలో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లోని ఆర్బీకేల్లో సిబ్బంది స్థానికంగానే అందుబాటులో ఉండి రైతులకు కావల్సిన వ్యవసాయ సలహాలు, సూచనలు అందజేస్తున్నారన్నారు. మేలిరకమైన ఎరువులు, విత్తనాలను ఈకేంద్రాల ద్వారానే సరఫరా చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా సీహెచ్‌సీ గ్రూపులకు ట్రాక్టర్లు, వరికోత యంత్రాలను సబ్సిడీపై అందజేస్తున్నామని తెలిపారు. పండించిన పంటలకు తగిన గిట్టుబాటు ధర కల్పించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తగిన తోడ్పాటు ఇస్తోందన్నారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, అచ్చంపేరంటాళ్ల దేవస్థానం చైర్మన్ మేచినేని నాగమల్లేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పెమ్మిరాజు ఆంజనేయులు, సర్పంచ్ చిమట ఉమాదేవి, ఎంపీటీసీ సభ్యులు పగడాల పద్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, నాయకులు సీహెచ్ నర్సారెడ్డి, జి.చెన్నకేశవరెడ్డి, ఆలపాటి ఉమామహేశ్వరరావు, మీసాల కోటిబాబు, గోసు శ్రీను, మాజీ ఎంపీపీ కోట దాసు ఎంపీడీవో వై.పిచ్చిరెడ్డి, ఏవో సాయిశ్రీ పాల్గొన్నారు.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



తిరువూరులో హనుమంతరావు దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు



సాయిబాబాకు పూజలు చేస్తున్న అర్చకులు

తిరువూరు: వ్యాస పూర్ణిమ సందర్భంగా సోమవారం గురు పూజోత్సవాన్ని తిరువూరులోని పలు దేవాలయాలు, విద్యా సంస్థల్లో నిర్వహించారు. షిర్డిసాయి మందిరంలో సాయిబాబాకు విశేషపూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రిటైర్డు ఉద్యోగి హనుమంతరావును మందిర కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. మందిర కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గూడపాటి మాణిక్యాంబ, గుడిమెట్ల వీరభద్రరావు, కోశాధికారి చిట్లూరి సురేష్ పాల్గొన్నారు. శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో పలువురు అధ్యాపకులను గురుపూజోత్సవం సందర్భంగా యాజమాన్యం సత్కరించింది.

గంపలగూడెం: గంపలగూడెం షిర్డీసాయిబాబా ధ్యాననిలయంలో బాబాకు భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రామాలయం అర్చకులు దేవయజనం శ్రీధరాచార్యులు అర్చక బృందంచే గణపతి, దత్తాత్రేయ, ఆంజనేయస్వామి, షిర్డీసాయి బాబాలకు పంచామృతాలతో అభిషేకం జరిపారు. దేవతామూర్తులకు ప్రత్యేక అలంకరణ గావించి విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలను శివాలయంలో వేం చేసి ఉన్న షిర్డీ సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి సందర్భంగా సోమవారం భక్తులచే బాబాకు 108 బిందెలతో జలాభిషేకం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు డి.రామలింగేశ్వర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దీపోత్సవం, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలోని షిర్డి సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం కాగడ హారతితో పూజలు, విశేష అభిషేకాలు చేశారు. ఆలయ ట్రస్టీ బొర్రా వెంకటేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. బొర్రా క్రాంతికుమార్, అత్తలూరు రమణ, కంటి ప్రసాద్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మైలవరం: మైలవరంలోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో గురు పూజోత్సవం ఘనంగా నిర్వహించారు. బాబాకు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విస్సన్నపేట: స్థానిక షిర్డీసాయిబాబా సేవామందిరంలో గురు పూర్ణిమ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారి పల్లకీ ఉత్సవం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, భజనలు, మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు.

గంపలగూడెం: గంపలగూడెం షిర్డీ సాయిబాబా ధ్యాన నిలయంలో నందా దీపోత్సవం నిర్వహించారు. భక్తులు బాబా విగ్రహాన్ని పల్లకిలో ఉంచి, నందా దీపాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

ప్రజల హృదయాల్లో సీఎం జగన్ చెరగని ముద్ర



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న రక్షణనిధి

నారికింపాడు/లంబాడీతండా(గంపలగూడెం): సంక్షేమ పథకాలను అమలు పరుస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకొన్నారని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం మండలం వినగడప సచివాలయం పరిధిలోని నారికింపాడు, లంబాడీతండాల్లో సోమవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి రాష్ట్రంలో గడిచిన నాలుగేళ్లుగా అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, బ్రోచర్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామ పంచాయతీ పరిధిలో అభివృద్ధి పథకాలకు రూ.3.30 కోట్లు, సంక్షేమ పథకాలకు రూ.15.21 కోట్లు ఖర్చు చేశామన్నారు. సంక్షేమ పథకాల అమల్లో ఎలాంటి రాజకీయ వివక్షత చూపకుండా నేరుగా ముఖ్యమంత్రి లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్‌లలోనే నగదు జమ చేస్తున్నామన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు మరోసారి వైఎస్సార్ సీపీని బలపర్చాలని కోరారు. సచివాలయం గ్రాంట్ రూ.20 లక్షలతో పాటు ఎమ్మెల్యే గ్రాంట్ మరో రూ.10 లక్షలు కలిపి సిమెంట్ రహదారుల నిర్మాణం, విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కట్టలేరుపై హైబ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి ప్రజల ఇక్కట్లు తొలగిస్తామన్నారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, అచ్చంపేరంటాళ్ల దేవస్థానం చైర్మన్ మేచినేని నాగమల్లేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పెమ్మిరాజు ఆంజనేయులు, సర్పంచ్ చిమల ఉమాదేవి, ఎంపీటీసీ సభ్యులు పరిటాల పద్మ, మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, నర్సారెడ్డి, జి.చెన్నకేశవరెడ్డి, ఆలపాటి ఉమా, మీసాల కోటిబాబు, గోసు శ్రీను, కోట దాసు, ఎంపీడీవో పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ

జి.కొండూరు: మండల పరిధి చెవుటూరు గ్రామంలో 2022-23 సంవత్సరానికి గానూ నిర్వహించిన ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్‌ను అధికారులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పిన్నిబోయిన శ్రీదేవి ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభను జరిపారు. సర్పంచ్ మాట్లాడుతూ.. ఈ ఏడాది కాలంలో గ్రామ పరిధిలో రూ.98 లక్షల విలువైన 46 పనులను పూర్తి చేశామన్నారు. అనంతరం ఆడిట్ బృందం గ్రామంలో నిర్వహించిన పనులు, ఎస్టిమేట్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పుప్పాల సుబ్బారావు పాల్గొన్నారు.

వీటీపీఎస్ స్టోర్స్ ఎన్నికకు నోటిఫికేషన్

ఇబ్రహీంపట్నం: ది వీటీపీఎస్ ఆఫీసర్స్, కన్జ్యూమర్స్ కో ఆపరేటివ్ స్టోర్స్ పాలకవర్గం ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సత్యనారాయణరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రహస్య బ్యాలెట్ పద్ధతిలో 11 మంది పాలకవర్గం సభ్యుల ఎన్నికకు నామినేషన్‌ల ప్రక్రియ ఈనెల 7న ప్రారంభమవుతుందన్నారు. 8న నామినేషన్ల పరిశీలన, 9న సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, అనంతరం అభ్యర్థుల తుదిజాబితా ప్రదర్శిస్తామని చెప్పారు. 16న ఇంజినీర్స్ అసోసియేషన్ హాల్‌లో ఎన్నిక, అనంతరం ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు.

నేటి జగనన్న సురక్ష కార్యక్రమాలు

తిరువూరురూరల్: తిరువూరు నియోజకవర్గంలోని చౌటపల్లి, కాకర్ల, ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని గుంటుపల్లి-1, మూలపాడు-1, కొండపల్లి రెండో సచివాలయం, చాట్రాయి మండలంలోని చనుబండ గ్రామం, విస్సన్నపేట మండలంలోని కొండపర్వ, పుట్రేల -1, విస్సన్నపేట మండలంలోని పుట్రేల సచివాలయం -1. నూజివీడు మండలంలోని పాతరావిచర్ల, నూజివీడు పట్టణంలోని 3వ వార్డులో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయా మండలాల అధికారులు తెలిపారు. సురక్ష క్యాంప్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

బోధన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న వీసీ ఆచార్య విజయ్‌కుమార్

నూజివీడు: మారుతున్న కాలానికి అనుగుణంగా బోధనా సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ఆచార్య ఎం.విజయ్ కుమార్ అన్నారు. ప్రభుత్వ యూపీ స్కూళ్లు, హైస్కూళ్లలో ప్రభుత్వం ఇటీవల ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో డిజిటల్ విద్యను విద్యార్థులకు అందించేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో నూజివీడు, చింతలపూడి, లింగపాలెం మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రతి ఉపాధ్యాయుడు టెక్నాలజీ గురించి తెలుసుకోవాలన్నారు. ఈ శిక్షణ తరగతులకు సమన్వయకర్తగా ముసునూరు ఎంఈవో-2 బీవీఎస్ సుబ్బారావు వ్యవహరించారు. ట్రిపుల్ ఐటీ ఏవో పి.ప్రదీప్, డీన్ అకడమిక్స్ లక్ష్మణ్, సీఎస్ఈ హెచ్‌వోడీ చిరంజీవి, పీఆర్వో బి.సురేష్‌బాబు పాల్గొన్నారు.

తిరువూరు: ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులకు ఉత్తమ బోధన అందించాలని తిరువూరు శ్రీవాహినీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు సూచించారు. కళాశాలలో తిరువూరు, విస్సన్నపేట, గంపలగూడెం మండలాల ఉపాధ్యాయులకు డిజిటల్ విధానంలో బోధనపై రెండు రోజుల శిక్షణా తరగతులను ప్రారంభించారు. కోర్సు డైరెక్టర్ ఎం.రామకృష్ణ, రిసోర్సు పర్సన్లు హరికృష్ణ, పాండురంగారావు శిక్షణ ఇచ్చారు.

మైలవరం: పోటీ ప్రపంచంలో మారుతున్న విద్యా విధానాలను అనుసరించి విద్యా బోధన చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏ.కొండూరు, రెడ్డిగూడెం ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఫేజ్-1లో భాగంగా శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. మైలవరం ఎంఈవో ప్రసంగించారు. లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు వీరయ్య, గోపీ సురేష్, విజయకుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు. అనుసంధాన టీచర్‌గా కె.కోటేశ్వరరావు, సీఆర్పీలు ఏ.జమలయ్య, ఉషారాణి, విఘ్నేష్ పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతుల్లో విద్యాబోధన చేయాలి



ప్రసంగిస్తున్న కులంథైవేల్

మైలవరం: నేటి తరం విద్యార్థులకు ఆధునిక పద్ధతుల్లో విద్యా బోధన చేయాలని, అందుకు ఐసీటీ టూల్స్ ఉపయోగించాలని చెన్నైకు చెందిన ఎన్ఐటీటీటీఆర్ సెంటర్ ఫర్ ఇంటర్‌నేషనల్ ఎఫైర్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ హెడ్ డాక్టర్ జి.కులంథైవేల్ తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఐక్యూఏసీ, సీఎస్ఈ, ఏఐ అండ్ డీఎస్ అండ్ ఐటీ సంయుక్త ఆధ్వర్యంలో, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రెయినింగ్ అండ్ రీసెర్చ్(ఎన్ఐటీటీటీఆర్) సౌజన్యంతో ఇన్‌స్ట్రక్షనల్ డిజైన్ అండ్ డెలివరీ సిస్టమ్స్ అనే అంశంపై ఐదు రోజులు అధ్యాపక అభివృద్ధి శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఇన్‌స్ట్రక్షనల్ అబ్జెక్టివ్స్ అండ్ లెర్నింగ్ ఔట్‌కమ్స్‌ను డాక్టర్ కే.ఎస్.గిరిధరన్ వివరించారు. శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు తెలిపారు. ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ బి.రమేష్‌రెడ్డి, డీన్స్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం- దేవదాయ ధర్మదాయ శాఖ

శ్రీ రామకృష్ణ పబ్లిక్ ట్రస్ట్

గొల్లపల్లి గ్రామము, నూజివీడు మండలము, ఏలూరు జిల్లా.

భూముల కౌలు హక్కు టెండర్ కం బహిరంగ వేలము ప్రకటన

ఏలూరు జిల్లా, నూజివీడు మండలము, గొల్లపల్లి గ్రామము నందు గల శ్రీ రామకృష్ణ పబ్లిక్ ట్రస్ట్ నకు చెందిన ఈ దిగువ పేర్కొన్న భూములకు కౌలు హక్కు కాల పరిమితి 3 సంవత్సరములకు గాను ది.13-07-2023 వ తేదీ ఉదయం గం.11.00 లకు గొల్లపల్లి గ్రామములోని శ్రీ రఘునాథ స్వామి వారి ఆలయ ప్రాంగణములో దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో కార్యనిర్వహణాధికారి వారిచే టెండర్ కం బహిరంగ వేలము జరుపబడును. కావున వేలము నందు పాల్గొనదలచిన వారు ఈ క్రింది విధముగా ధరవతు చెల్లించి పాటలో పాల్గొనవలెను.

షెడ్యూలు

క్ర.సం.	భూమియున్న గ్రామము	ఆర్.ఎస్.నెం.	విస్తీర్ణం (య.సెం)	ప్రథమ ధరావత్తు	కౌలు కాల పరిమితి
1.	పోలసానపల్లి	157/2	1.57	5,000/-	2023-24 నుండి 2025-26 వరకు
2.	పోలసానపల్లి	159/3	3.54	10,000/-	2023-24 నుండి 2025-26 వరకు

ముఖ్యమైన పాట షరతులు

1. ఈ టెండర్ కం బహిరంగ వేలము హిందూ దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల ఆమోదపు ఉత్తర్వులకు లోబడి సంస్థ కార్యనిర్వహణాధికారి వారిచే జరుపబడుచున్నది. 2. ప్రతి పాటదారు పాటకు ముందుగా పైన తెలియపర్చిన మొత్తమును ప్రథమ ధరావతుగా చెల్లించి పాటలో పాల్గొనవలెను. 3. హెచ్చుపాటదారు పాట ముగిసిన వెంటనే పాట మొత్తమును అడ్వాన్సుగా చెల్లించే నిర్ణయము. తదుపరి రెండు సంవత్సర కౌలు ప్రతి సంవత్సరం ఏప్రియల్ మొదటి వారంలో చెల్లించే నిర్ణయం. 4. ఏ కారణము తెలుపకయే పాటను ఆపు చేయుటకు గాని వాయిదా వేయుటకు గాని డిపార్టుమెంట్ వారికి అధికారము కలదు.

గమనిక :- శ్రీ రామకృష్ణ పబ్లిక్ ట్రస్ట్ నకు 2023 వ సంవత్సరము వరకు కౌలు హక్కు కలిగియుండి పాత బకాయిలు చెల్లించని యెడల ఆ భూములకు కూడా పై తేదీన కౌలు హక్కు బహిరంగ వేలము పాట నిర్వహించబడును.


గొల్లపల్లి,
08-07-2023

ఇట్లు: తల్లాప్రగడ విశ్వేశ్వరరావు
కార్యనిర్వహణాధికారి, ఫోన్ నెం.8096083371

బాధ్యతలు స్వీకరించిన ఎంఈవో సేవియా

నూజివీడు: నూజివీడు ఎంఈవోగా ఎం.సేవియా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇన్‌చార్జి డీవైఈవోగా పనిచేస్తున్న సేవియా ఇటీవల నిర్వహించిన ప్రమోషన్ కౌన్సెలింగ్‌లో నూజివీడు ఎంఈవోగా నియమితులయ్యారు. పలు ఉపాధ్యాయ సంఘాలకు చెందిన నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలలో గ్రీనరీ పనుల ప్రారంభం



జూపూడి(ఇబ్రహీంపట్నం): కేంద్ర ఘన, ద్రవ వ్యర్థాల నిర్వాహణ మంత్రిత్వ శాఖ జూపూడిలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా ఎంపీపీ మోడల్ పాఠశాలలో గ్రీనరీ పనులు సోమవారం ప్రారంభించారు. అందుకు అవసరమైన మట్టి పనులను గ్రామ కార్యదర్శి మునేశ్వరరావు, గ్రేడ్-5 కార్యదర్శి శ్రీకాంత్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఫరూక్ తదితరులు పర్యవేక్షించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మున్సిపాల్టీలోని 5వ వార్డులో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి సోమవారం భూమిపూజ జరిగింది. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5 లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డుకు వార్డు కౌన్సిలర్ మొగిలి దయాసాగర్ పూజలు చేసి పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే వసంత ఆదేశాలతో అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపడుతున్నామన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆగిరిపల్లి ఎంఈవోగా సర్వేశ్వరరావు

ఆగిరిపల్లి(నూజివీడు): ఆగిరిపల్లి ఎంఈవోగా కలపాల సర్వేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అవనిగడ్డ ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తూ పదోన్నతిపై ఎంఈవోగా నియమితులయ్యారు. ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

వేంకటాచలస్వామికి గరుడ సేవ

తిరువూరు: ఆషాఢ పౌర్ణమి సందర్భంగా స్థానిక శ్రీ వేంకటాచలస్వామి దేవస్థానంలో గరుడ వాహన సేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు దేవయాజనం వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించిన అనంతరం వైష్ణవ గోష్ఠి సభ్యులు ఊరేగింపు జరిపారు.

ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చు

మైలవరం: విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు చేరుకుంటారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సెమిస్టర్ బీకాం విద్యార్థిని ఉయ్యాల యామిని బిజినెస్ ఆర్గనైజేషన్ మేనేజ్‌మెంట్ సబ్జెక్టులో నూటికి నూరు శాతం మార్కులు సాధించిన సందర్భంగా అభినందించి, నగదు బహుమతి అందజేశారు. కామర్స్ డిపార్ట్‌మెంట్ సీనియర్ ఫాకల్టీ జి.నారాయణరావు, కె.శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

స్పందనలో అర్జీల అందజేత

మైలవరం: తోలుకోడు గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకుడు ఇంకొల్లు జమలయ్య స్పందన కార్యక్రమంలో తహసీల్దారు ఎం.శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. స్పందనలో మూడు అర్జీలు అందినట్లు ఎంపీడీవో లక్ష్మీకుమారి తెలిపారు.

గంపలగూడెం: ఊటుకూరులో చెన్నవరం- మల్లవరం రహదారి నుంచి వడ్డెరకుంట వరకు రైతాంగం పొలాలకు వెళ్లే రహదారిలో ఆక్రమణలు తొలగించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు కాజా నాగేంద్రరావు స్పందనలో తహసీల్దార్ బాలకృష్ణారెడ్డికి ఫిర్యాదు చేశారు. గంపలగూడెం పాత దేవి థియేటర్ ప్రాంతంలో మురుగునీటి పారుదల చర్యలు చేపట్టాలని లింగమర్ల హరీష్ కుమార్ ఫిర్యాదు చేశారు. ఈవో పీఆర్డీ డి.బాబురావు పాల్గొన్నారు.

7న మండల పరిషత్ సమావేశం

చాట్రాయి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 7వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దుర్గాప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ లంకా నిర్మల అధ్యక్షతన 7వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తగిన సమాచారంతో హాజరు కావాలని ఆయన కోరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

తిరువూరు డివిజన్

99510 20399 (తిరువూరు,
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)

Office mail : sakshiads@gmail.com